చేతులెత్తి మొక్కుతున్నాం..

మహాలక్ష్మీ పథకంతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయ్

ఆదుకోవాలని వరంగల్ బస్టాండ్ ఎదుట ఆటోడ్రైవర్ల ధర్నా.. అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

వరంగల్ చౌరస్తా, డిసెంబర్29: 'మహాలక్ష్మీ పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయ్.. ఆదుకోవాలని చేతులెత్తి మొక్కుతున్నాం' అని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లు, డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించాలన్న ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం మేరకు వరంగల్ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. బస్టాండ్ వద్ద బస్సుల రాకపోకలు సాగకుండా అడ్డుకొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ధర్నా విరమించాలని ఆటోడ్రైవర్లకు నచ్చజెప్పినా వినకపోవడంతో వారిని అరెస్టు చేశారు. అనంతరం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్స్ ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యుడు ఈసంపల్లి సంజీవ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏ మహిళా కోరని ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆటో డ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడేసిందన్నారు. యూనియన్ నాయకులు ఈసంపల్లి సంజీవ, మంద శ్రీధర్‌రెడ్డి, మడికొండ బాబు, కలకోట్ల జయరాం, బొల్లం సంజీవ్, బోల్ల ఈశ్వర్, ఎస్‌కే అమీరుద్దీన్‌లపై కేసు నమోదు చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పోలీసులకు చేతులెత్తి మొక్కుతున్న ఆటో డ్రైవర్లు

జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద గల లక్ష్మీబరాజ్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రుల బృందం పరిశీలించింది. రాష్ట్ర నీటి పారుదలశాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మేడిగడ్డలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుపై ఈఎన్‌సీ మురళీధర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు ప్రారంభం మొదలు ఇప్పటివరకు గల పరిస్థితులను మంత్రులకు వివరించారు.

– జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ)/ మహదేవపూర్

లక్ష్మీబరాజ్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

మేడిగడ్డలో మంత్రులు

లక్ష్మీబరాజ్‌ను పరిశీలించిన ఉత్తమ్, పొంగులేటి, కోమటిరెడ్డి, దుద్దిళ్ల, పొన్నం

ముందుగా రాష్ట్ర మంత్రులు మధ్యాహ్నం 12:14గంటలకు మేడిగడ్డకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఇరిగేషన్ అధికారులు వారికి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఎల్‌అండ్‌టీ అతిథి గృహానికి చేరుకున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించి ఈఎన్సీ మురళీధర్‌ను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వాల్సిందిగా కోరగా ఆయన సుమారు రెండు గంటల పాటు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి రిపోర్టును గణాంకాలతో కళ్లకు కట్టినట్లు వివరించారు. 13 జిల్లాలు, 31 నియోజకవర్గాలు, 121 మండలాలు, 1,698 గ్రామాలకు నీరందించేందుకు 141 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీతో ప్రాజెక్టును నిర్మించినట్లు వెల్లడించారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1.27 లక్షల కోట్ల అంచనా రూపొందించగా, ఇప్పటి వరకు రూ.93.87 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. లక్ష్మీబరాజ్‌లోని 7వ బ్లాక్‌లో 20వ పిల్లర్ కుంగిందని, దీనికి సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం పరిశీలించిందని, వారు అడిగిన వివరాలను తాము సమర్పించామని చెప్పారు. కుంగుబాటుపై క్షేత్రస్థాయిలో అధ్యయనం కొనసాగుతోందని, ప్రస్తుతం బరాజ్ వద్ద ఏజెన్సీ సంస్థ గ్రౌటింగ్ పనులు ప్రారంభించిందన్నారు. కాపర్ డ్యాం పనులు వేగంగా కొనసాగుతున్నాయని, 15 రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు. 19,20,21 పిల్లర్లను డైమండ్ కటింగ్‌తో తొలగించి కాంక్రీట్‌తో మళ్లీ నిర్మించేందుకు సంస్థ సన్నద్ధమవుతోందన్నారు. మూడు గేట్లను సైతం కొత్తగా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ అనంతరం మంత్రుల బృందం విలేకరులతో కలిసి లక్ష్మీబరాజ్‌పైకి చేరుకుని పిల్లర్ కుంగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇంజినీర్, అధికారుల బృందం మంత్రులకు కుంగిన పిల్లర్‌ను, చేపట్టాల్సిన పనులను వివరించారు. అక్కడి నుంచి 4:30గంటలకు మంత్రుల బృందం హెలికాప్టర్ ద్వారా అన్నారం బరాజ్ వద్దకు వెళ్లారు. అన్నారం బరాజ్ వద్ద ఈఈ యాదగిరి వారికి స్వాగతం పలికి బరాజ్‌లోకి తీసుకెళ్లారు. బరాజ్‌లో ఏర్పడిన చిన్న చిన్న సీపేజ్‌లను మంత్రులకు చూపించారు. 2020లో చిన్న చిన్న బుంగలు వస్తే కెమికల్ గ్రౌటింగ్ చేసి తీసివేశామని వారికి తెలిపారు. 2021లో మళ్లీ సీపేజ్ రావడంతో అందులోంచి ఇసుక వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, బరాజ్ నుంచి నీటిని తీసివేస్తే పర్మినెంట్ పనులు చేస్తామని ఆప్కాన్ సంస్థ ప్రతినిధి మల్లికార్జున్‌రావు తెలిపారు. నీటిని తీసేసేందుకు రెండు రోజుల్లో అనుమతి ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వారికి వెల్లడించారు. అనంతరం అక్కడి నుంచి మంత్రులు హైదరాబాద్ వెళ్లారు.

మేడిగడ్డలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈఎన్‌సీ మురళీధర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

- డైమండ్ కటింగ్‌తో మూడు పిల్లర్లు తీసి నిర్మిస్తామని వెల్లడి
- కాపర్ డ్యాం పనులు 15 రోజుల్లో పూర్తి చేస్తామన్న ఈఎన్‌సీ
- లక్ష్మీ, సరస్వతీ బరాజ్‌ల పరిశీలన
- ముంపు గ్రామాల ప్రజలను ఆదుకోవాలి : మంత్రి శ్రీధర్‌బాబు

ముంపు బాధితులను ఆదుకోవాలి : మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం ప్రాజెక్టు ముంపు బాధిత రైతులను ఆదుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. ప్రాజెక్టు మూలంగా రైతుల పంటలే కాకుండా గ్రామాలు కూడా ముంపునకు గురవుతున్నాయన్నారు. కరకట్టల నిర్మాణాలు చేపట్టి ముంపు నుంచి కాపాడాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలతో ఆదుకోవాలని కోరారు. చిన్న కాళేశ్వరం పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లా ప్రజలకు సాగు, తాగు నీరందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో బ్యాక్‌వాటర్ సమస్య ఉందని, త్వరగా పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమాల్లో ఈఈలు తిరుపతిరావు, యాదగిరి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలులో జాప్యం చేయొద్దు

- పార్లమెంట్ ఎన్నికలు ముగిసే దాకా ప్రభుత్వం దరఖాస్తుల షో
- అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిద్దాం..
- బీఆర్ఎస్ శ్రేణులతో మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, డిసెంబర్ 29 : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను త్వరగా అమలు చేయాలని, జాప్యం చేయొద్దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం తొర్రూరు పార్టీ కార్యాలయంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తుల విషయంలో ప్రజల నుంచి వస్తున్న అభిప్రాయాలపై ఆరా తీశారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల వరకు హామీల అమలును దాటేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని, ఖజానా ఖాళీగా ఉందని ఆరోపణలు చేస్తూ, హామీలను వాయిదా వేస్తూ రోజులు గడుపుతున్నదని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అడ్డగోలుగా అప్పులు చేసిందని ఆరోపణలు చేస్తూ, రాష్ట్రంలో ఆస్తులు పెంచిన విషయాన్ని దాటవేస్తున్నదని అన్నారు. నాణ్యమైన కరెంట్, సాగునీటితో పరిశ్రమలు, వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చారని, రైతుబంధు వంటి అద్భుతమైన పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. పౌరసరఫరాల శాఖ, విద్యుత్‌శాఖలో అప్పుల గురించి చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూసి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో అప్పులు చేయని రాష్ట్రం లేదని, తెలంగాణలో కూడా కేంద్రం, రిజర్వ్‌బ్యాంక్ నిబంధనలకు లోబడి అప్పులు తెచ్చిందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల వరకు ప్రజలను మభ్యపెట్టేలా ప్రభుత్వం దరఖాస్తుల షో నిర్వహిస్తున్నదని, మున్ముందు ప్రజలకు అన్ని విషయాలు అర్థమవుతాయన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల మేర వివిధ శాఖల్లో అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, ప్రజాశ్రేయస్సు కోసం వాటిని పూర్తి చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా సహకారం అందించాలన్నారు. అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పారు. పార్టీ శ్రేణులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు డాక్టర్ పీ సోమేశ్వర్‌రావు, పసుమర్తి సీతారాములు, ఈదురు ఐలయ్య, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు ఎన్నమనేని శ్రీనివాసరావు, దొంగరి శంకర్, కాలునాయక్, బిజ్జాల అనిల్, కర్నె నాగరాజు, తూర్పాటి రవి, గుండాల నర్సయ్య, కుర్ర శ్రీనివాస్, జంపా, సుధీర్, యాదగిరిరావు, ముత్తినేని శ్రీనివాస్, కిరణ్, రాయిశెట్టి వెంకన్న, వినయ్ పాల్గొన్నారు.

తాత సంవత్సరీకం రోజే..

వాగులో స్నానానికి వెళ్లి ఇద్దరు మనుమళ్లు మృతి

మృతులు బావ బామ్మర్దులు

మొగుళ్లపల్లి మండలం వేములపల్లిలో విషాదం

తాటిపాముల పవన్ (ఫైల్)

సిరిమల్లె శ్రీకాంత్(ఫైల్)

మొగుళ్లపల్లి, డిసెంబర్ 29: తాత సంవత్సరీకానికి వచ్చి వాగులో స్నానానికి వెళ్లిన ఇద్దరు మనుమళ్లు మృతిచెందారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం వేములపల్లిలో శుక్రవారం జరిగింది. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. మండలంలోని వేములపల్లిలో తాటిపాముల రాజీరు మృతి చెంది ఏడాది అవుతుండగా, శుక్రవారం సంవత్సరీకం కార్యక్రమానికి బంధువులు వచ్చారు. ఈ క్రమంలో రాజీరు కొడుకు సుధాకర్ కార్యక్రమ ఏర్పాట్లలో ఉండగా, సుధాకర్ కొడుకు తాటిపాముల పవన్ కుమార్ (27), జమ్మికుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన రాజీరు బిడ్డ కొడుకు సిరిమల్లె శ్రీకాంత్(18) సమీపంలోని వాగులో స్నానానికి వెళ్లారు. వాగులోనే బావి ఉండగా అక్కడ ఈత కొట్టేందుకు దిగారు. ఈత కొడుతూ లోతు ఉన్న ప్రాంతానికి వెళ్లి నీటిలో మునిగి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెళ్లి, పోలీసుల సహకారంతో మృతదేహాలను బయటకు తీశారు. మృతులు బావ బామ్మర్దులు కావడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతుల తండ్రులు సుధాకర్, రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సత్యవతికి హరీశ్‌రావు పరామర్శ

హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

మహబూబాబాద్, డిసెంబర్29 (నమస్తే తెలంగాణ) మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం పరామర్శించారు. సత్యవతిరాథోడ్ సోదరుడు గుగులోత్ కిషన్‌నాయక్ ఇటీవల మృతిచెందారు. శుక్రవారం దశదిన కర్మ నిర్వహించగా, హరీశ్‌రావుతోపాటు తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జడ్పీచైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియ, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నాయకులు నూకల నరేశ్‌రెడ్డి, జాన్సన్ రాథోడ్, పెద్ది స్వప్న, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ హాజరై కిషన్ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యవతి తన పరిస్థితిని హరీశ్‌రావుకు వివరిస్తూ కన్నీరు పెట్టుకున్నారు. తాను రాజకీయాల్లోకి రావడానికి తన అన్న ఎంతగానో ప్రోత్సహించారని, రెండు సంవత్సరాల్లో అమ్మ, నాన్న, అన్నను కోల్పోయానని విలపించారు. ధైర్యంగా ఉండాలే అక్కా అంటూ హరీశ్‌రావు ఆమెకు సూచించారు.

కిషన్‌నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు, ఎమ్మెల్సీ సత్యవతి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు



నర్మెటలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నర్మెటలో 'ప్రజా పాలన' పరిశీలన

జనగామ, (నమస్తే తెలంగాణ)/నర్మెట, డిసెంబర్ 29 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చూడాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. శుక్రవారం జనగామ పట్టణం 4, 8, 9,13 వార్డుల్లో, నర్మెట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన పట్టణ, గ్రామసభలను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారెంటీలకు ప్రజలు అందిస్తున్న దరఖాస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. జనవరి 6వ తేదీ వరకు గ్రామపంచాయతీల్లో దరఖాస్తులు అందించవచ్చని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, నర్మెట ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్, నర్మెట, తరిగొప్పుల మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, వెల్దండ సర్పంచ్ నర్ర వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రాడ్యుయేట్స్ ఓటర్ల నమోదుకు షెడ్యూల్ విడుదల

హనుమకొండ, డిసెంబర్ 29 : వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన పబ్లిక్ నోటీసు శనివారం విడుదల చేయనున్నారు. 2023 నవంబర్ ఒకటో తేదీలోపు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులైన వారు అర్హులని అధికారులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఫారం–18 ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారు.

ప్రతి దరఖాస్తును అధికారులు స్వీకరించాలి

- అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి
- ప్రజాపాలన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వాకాటి కరుణ



హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో 'ప్రజాపాలన'ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న వాకాటి కరుణ

హనుమకొండచౌరస్తా/ స్టేషన్‌ఘన్‌పూర్/ రఘునాథపల్లి/ గీసుగొండ/ ధర్మసాగర్/ కాశీబుగ్గ, డిసెంబర్ 29 : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ కమిషనర్, ప్రజాపాలన ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి వాకాటి కరుణ ఆదేశించారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే గ్రేటర్ 15వ డివిజన్ గొర్రెకుంట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. అలాగే ధర్మసాగర్ మండల పెద్దపెండ్యాల, ధర్మసాగర్ గ్రామాల్లో తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో జవహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించగా, వాకాటి కరుణ ఆయా గ్రామాలను సందర్శించారు. కాశీబుగ్గ 14వ డివిజన్ బాలాజీ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించారు. గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులతో కౌంటర్లు, ఇతర ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, మహేందర్ జీ, అశ్విని తానాజీ వాకడే, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ విజయ్‌కుమార్, నోడల్ అధికారి మేన శ్రీను పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్, గోవర్ధనగిరిలో..

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంతోపాటు రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజాపాలన ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి వాకాటి కరుణ, కలెక్టర్ శివలింగయ్యతో కలిసి ఆమె తనిఖీ చేశారు. దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాకాటి కరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ రెండో రోజు జిల్లాలో 38 గ్రామ పంచాయతీల్లో, జనగామ మున్సిపల్‌లోని నాలుగు వార్డుల్లో దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పర్మర్ పింకేష్‌కుమార్, డీసీపీ సీతారాం, ఆర్డీవో వాసం రామ్మూర్తి, డీఏవో వినోద్‌కుమార్, ప్రజా పాలన అదనపు ప్రత్యేకాధికారి సుగుణాకర్ రాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.